చివరికి వరదమయం

- ఇంకా ముంపులోనే పంట పొలాలు
- వందలాది ఎకరాల్లో కుళ్లిపోతున్న వరి పంట
- ఆందోళన చెందుతున్న అన్నదాతలు



కిర్లంపూడిలో ఇంకా ముంపులోనే ఉన్న వరి చేలు



వరద నీటికి ఊటబారి కుళ్లిపోయిన వరి పంట

కిర్లంపూడి: గతంలో ఎన్నాడూ లేనివిధంగా ఏలేరు వరద నీరు కిర్లంపూడి మండలాన్ని ముంచెత్తింది. రైతుల ఖరీఫ్ ఆశలపై నీళ్లు చల్లింది. వాయుగుండం ప్రభావంతో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు ఏలేరు రిజర్వాయర్‌లోకి సుమారు 23 టీఎంసీల నీరు పోటెత్తడంతో ఏలేరు కాలువకు అంచెలంచెలుగా సుమారు 26 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. దీంతో మండలంలోని రాజుపాలెం, భూపాలపట్నం, రామకృష్ణాపురం గ్రామాల్లో ఏలేరు కాలువ గట్టుకు గండ్లు పడి ఏలేరు పరివాహక గ్రామాలను వరద నీరు ముంచెత్తింది. ఆయా గ్రామాల్లో పంట పొలాలు నేటికీ ముంపులోనే ఉన్నాయి.

అప్పులు చేసి పెట్టుబడులు

మండలంలోని రైతులు, కౌలు రైతులు అప్పులు చేసి పంటల సాగు చేపట్టారు. పలువురు రైతులు బ్యాంకుల ద్వారా రుణాలు పొందగా, మరికొందరు గ్రామాల్లో అప్పులు చేశారు. వరి సాగుకు ఎకరాకు రూ.25 వేల వరకూ పెట్టుబడి పెట్టారు. మండలంలో వరి ప్రధాన పంట కాగా చెరకు, అరటి, ఆయిల్ పామ్, కూరగాయలతో పాటు ఇతర పంటలు కూడా పండిస్తున్నారు. పలు గ్రామాల్లో వరద ముంపునకు గురై పంటలు పూర్తిగా దెబ్బతినడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

ప్రాథమిక అంచనా నష్టం రూ.65 కోట్లు

వరదల కారణంగా మండలంలో భారీ నష్టం జరిగింది. మండలంలోని రాజుపాలెం, ముక్కొల్లు, భూపాలపట్నం, సోమరాయణంపేట, పాలెం, గోనేడ, తామరాడ, రామచంద్రపురం, బూరుగుపూడి, ఎస్.తిమ్మాపురం, శృంగరాయునిపాలెం, కృష్ణవరం, సోమవరం, వేలంక, సింహాద్రిపురం, వీరవరం, చిల్లంగి, రామకృష్ణాపురం, కిర్లంపూడి గ్రామాల్లో సుమారు 6500 ఎకరాలు నీట మునిగాయి. సుమారు 65 కోట్లు నష్టం వాటిల్లిందని ప్రాథమికంగా అంచనా వేశారు.

పరిహారం పెంచాలి

ఇప్పటికే వరి పంటలకు ఎకరాకు సుమారు రూ.20 వేలకు పైగా ఖర్చు చేశామని ప్రభుత్వం ప్రకటించిన రూ.10 వేలు నష్టపరిహారం సరిపోదని రైతులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు పంట నష్టాన్ని పరిశీలించి తమకు న్యాయం చేస్తారని రైతులు భావిస్తున్నారు. పంట నష్టంపై తూతూమంత్రంగా సాయం అందించకుండా కష్టాల నుంచి గట్టెక్కించాలని రైతులు, కౌలు రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

పంట పూర్తిగా నీట మునిగింది



నేను రాజుపాలెంలో 5 ఎకరాలు కౌలుకు తీసుకుని వరి సాగు చేస్తున్నాను. ఎకరానికి రూ.20 వేలు చొప్పున రూ.లక్ష పెట్టుబడి పెట్టాను. రామకృష్ణపురంలో ఏలేరు కాలువ గట్టుకు గండి పడడంతో వరి పంట పూర్తిగా నీట మునిగింది. ప్రస్తుతం వరద తగ్గడంతో కొట్టుకుపోయిన గట్లను పూడ్చుకుంటున్నాం. నీరు ఎక్కువ రోజులు నిల్వ ఉండటంతో వరిదుబ్బులు కుళ్లిపోయాయి.

– **జల్లరపు గోవిందు**, రైతు, రాజుపాలెం

రైతులను ఆదుకోవాలి



తరచూ ఏలేరు కాలువ నుంచి వచ్చే వరద నీటితో పంటలు ముంపుకు గురై రైతులు నష్టపోతున్నారు. వరి చేలు పొట్ట దశలో ఉన్న సమయంలో వరద ముంచెత్తటంతో పంట పూర్తిగా దెబ్బతింది. ఇప్పటికే ఎకరాకు సుమారు రూ.20 వేలు పెట్టుబడి పెట్టిన రైతులు ఆర్థికంగా నష్టపోయారు. పంట నష్టపోయిన ప్రతి రైతుకూ ప్రభుత్వం తక్షణ సాయంగా రూ.15 వేలు, నష్ట పరిహారంగా ఎకరాకు రూ.20 వేలు ఇచ్చి ఆదుకోవాలి.

– **గోపు నారాయణమూర్తి**, భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు

పంట నష్టం అంచనా వేస్తున్నాం



భారీ వర్షాలు, వరదల కారణంగా జరిగిన పంట నష్టాన్ని అంచనా వేస్తున్నాం. ప్రతి గ్రామంలో ముంపునకు గురైన పొలాలను పరిశీలించి అంచనాలు రూపొందిస్తున్నాం. ఇప్పటికే 95 శాతం పంట నష్టం నమోదు చేశాం. పూర్తిస్థాయిలో పంట నష్టాన్ని నమోదు చేసి నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తాం.

– **జోకా అమృత**, మండల వ్యవసాయాధికారి, కిర్లంపూడి

క్లుప్తంగా

వేంకటేశ్వరస్వామికి పంచామృతాభిషేకాలు



స్వామి, అమ్మవార్లను దర్శించుకుంటున్న భక్తులు

తుని రూరల్: ఎస్.అన్నవరంలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వర స్వామి వారికి ఆదివారం పంచామృతాభిషేకాలు నిర్వహించారు. స్వామివారి తిరునక్షత్రం శ్రావణాన్ని పురస్కరించుకుని అర్చకులు స్వామివారికి విశేష పూజలు చేశారు. తొలుత పంచామృత కలశాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి స్వామి, అమ్మవార్లకు, పరివార దేవతలకు అభిషేకించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. పాత సంచుల వర్తక సంఘం, ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

జాతీయ రహదారికి మరమ్మతులు

తొండంగి: జాతీయరహదారిపై ఎన్‌హెచ్‌ఏఐ సిబ్బంది మరమ్మతు పనులు చేపట్టారు. ఇటీవల కురిసిన కుండపోత వర్షాలకు మండలంలోని బెండపూడి, తమ్మయ్యపేట, గోపాలపట్నం పరిధిలో జాతీయరహదారిపై భారీగా గుంతలు ఏర్పడ్డాయి. దీంతో కొద్ది రోజులుగా వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. పలు చోట్ల ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురై గాయాలపాలయ్యారు. ఈ నేపథ్యంలో హైవే అధికారులు రహదారి మరమ్మతులకు చర్యలు తీసుకున్నారు. మండల పరిధిలో హైవేపై మరమ్మతుల పనులు జోరుగా సాగుతున్నాయి.

వరద బాధితులకు నిత్యావసరాల పంపిణీ

కిర్లంపూడి: వరద బాధితులను అన్నివిధాలా ఆదుకునేందుకు కృషి చేస్తామని జనసేన జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ అన్నారు. మండలంలోని రామచంద్రపురంలో ఆదివారం సర్పంచ్ తుమ్మలపల్లి గుణశేఖర్ అధ్యక్షతన వరద బాధితులకు ప్రభుత్వం అందజేస్తున్న నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. రమేష్ ముఖ్య అతిథిగా పాల్గొని వరద బాధితులకు నిత్యావసరాల కిట్లను అందజేశారు.

17న సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సమావేశం

ప్రత్తిపాడు రూరల్: ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ) అభివృద్ధి కమిటీ సమావేశం ఈ నెల 17న మధ్యాహ్నం రెండు గంటలకు నిర్వహించనున్నట్లు సీహెచ్‌సీ ఆర్ఎంఓ సౌజన్య తెలిపారు. ఈ సమావేశానికి చైర్మన్ హోదాలో స్థానిక ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. సీహెచ్‌సీ అభివృద్ధికి సంబంధించి పలు అంశాలపై చర్చించనున్నట్టు తెలిపారు.

పేకాడుతున్న తొమ్మిది మంది అరెస్టు

తుని రూరల్: మండలంలోని తేటగుంట శివారు కొబ్బరితోటలో రహస్యంగా నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై ఆదివారం తుని రూరల్ పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో పేకాడుతున్న తొమ్మిది మందిని అరెస్టు చేసి రూ.83,910 నగదు, ఒక టేబుల్, పది కుర్చీలు స్వాధీనం చేసుకున్నట్టు రూరల్ ఎస్సై బి.కృష్ణామాచారి తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

పెద్దాపురం: కుటుంబ కలహాల నేపథ్యంలో వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం సాయంత్రం పెద్దాపురం పట్టణంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. స్థానిక లూథరన్ హైస్కూల్ సమీపంలో ఓ అపార్ట్‌మెంట్‌లో అద్దెకుంటున్న వేముల సురేఖ(35) కుటుంబ కలహాల నేపథ్యంలోఆత్మహత్యకు పాల్పడింది. భర్త సతీష్ గోదావరి గ్రామీణ బ్యాంక్ వేట్లపాలెం బ్రాంచిలో పని చేస్తున్నారన్నారు. ఏలూరుకు చెందిన ఆమెను వివాహమైనప్పటి నుంచి వారిద్దరి మధ్య ఉన్న మనస్పర్థల కారణఃగా పెద్దాపురంలో ఉంటున్న ఆమె ఆత్మహత్యకు పాల్పడిందని స్థానికులు చెబుతున్నారు. దీనిపై సీఐ క్రాంతికుమార్, ఎస్ఐ మౌనికలను వివరణ కోరగా ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన వాస్తవమని, దీనిపై విచారణ చేపట్టామన్నారు. మృతదేహాన్ని పెద్దాపురం ప్రభుత్వాసుపత్రికి పోస్ట్‌మార్టమ్ నిమిత్తం తరలించారు.

ఘనంగా దీపోత్సవం



సామర్లకోట గణపతి శిబిరంలో దీపాలంకరణ

సామర్లకోట: స్థానిక 13వ వార్డు బలుసులపేట రామాలయంలో ఏర్పాటు చేసిన గణపతి శిబిరంలో ఆదివారం రాత్రి దీపాలంకరణ చేశారు. ఈ దీపాలంకరణ వార్డు కౌన్సిలర్ నేతల హరిబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నాయకులు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలకు రాట ముహూర్తం



సోమరాజుపేటలో దసరా ఉత్సవాలకు పందిరి రాట వేస్తున్న మహిళలు

కిర్లంపూడి: జగపతినగరంలోని సోమరాజుపేటలో ఆదివారం శరన్నవరాత్ర ఉత్సవాలకు రాట ముహూర్తం చేశారు. మహిళా సంఘం సభ్యుల ఆధ్వర్యంలో ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి పందిరి రాట వేశారు. ఈ ఏడాది దసరా ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పెంటకోట నాగబాబు, ఎంపీటీసీ బొడ్డేటి గణపతి తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్



ఇసుక ట్రాక్టర్‌ను సీజ్ చేసిన ఎస్సై రామకృష్ణ

కోటనందూరు: తాండవ నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్సై టి.రామకృష్ణ ఆదివారం తెలిపారు. ట్రాక్టర్ డ్రైవర్‌ను అరెస్టు చేసి కేసు నమోదు చేశామన్నారు. ఈ సందర్భంగా ఎస్సై రామకృష్ణ మాట్లాడుతూ కోటనందూరు మండలంలో అనుమతులు లేకుండా ఇసుక, గ్రావెల్ తవ్వకాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



కరాటే పోటీల్లో ప్రశంసా పత్రాలను అందుకుంటున్న లంపకలోవ విద్యార్థులు

ప్రత్తిపాడు రూరల్: ఏలూరు సీఆర్‌ఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో ఈ నెల 14, 15 తేదీల్లో జరిగిన నేషనల్ షోటోకాన్ కరాటే ఓపెన్ చాంపియన్‌షిప్ –2024 (బడేటి కప్) పోటీల్లో మండలంలోని లంపకలోవ కరాటే స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. బాలికల విభాగంలో ఉత్తరకంచి ఆక్స్‌ఫర్డ్ స్కూల్‌కు చెందిన వై.కవిత, వై.అమృత, ప్రత్తిపాడు ప్రభుత్వ బాలికల వసతి గృహం విద్యార్థిని టీజేఎస్ఎం మానస ప్రథమ, ద్వితీయ స్థానాలను కైవసం చేసుకున్నారు. బాలుర విభాగంలో ఒమ్మంగి శ్రీభారతి విద్యానికేతన్ పాఠశాలకు చెందిన జె.సంజు, టి.సుకాంత్, మొదటి, రెండో స్థానాల్లో నిలిచారని కరాటే మాస్టర్ పి.బుజ్జి తెలిపారు. విజేతలకు కియో వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ కేఎల్‌ఎం శాస్త్రి, రాష్ట్ర షోటోకాన్ కరాటే అసోసియేషన్ కార్యదర్శి నాగం శివ తదితరులు మెడల్స్, ప్రశంసాపత్రాలను అందజేశారు. విజేతలను ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, స్థానిక నాయకులు అభినందించారు.

వీకే రాయపురం విద్యార్థికి ప్రోత్సాహకం

సామర్లకోట: వీకే రాయపురానికి చెందిన ఎంబీబీఎస్ విద్యార్థిని తలారి నాగదుర్గ శ్రీసాయి లయన్స్ క్లబ్ నుంచి రూ.45వేలు ప్రోత్సాహకం అందుకుంది. తూర్పుగోదావరి జిల్లా లయన్స్ సెంటిన్నియ్యల్ విద్యా ప్రోత్సాహ ట్రస్టు ఏటా పేద విద్యార్థులకు ఆర్థిక సాయం అందజేస్తోంది. దీనిలో భాగంగా 2024–25 విద్యా సంవత్సరానికి మెరిట్ విద్యార్థులకు కోనసీమ జిల్లా రామచంద్రపురం లయన్స్ క్లబ్‌లో 70 మంది విద్యార్థులకు ఆదివారం రూ.9.70లక్షలు స్కాలర్ షిఫ్ చెక్కులు, మరికొంత మందికి ల్యాబ్‌టాప్‌లను అందజేసినట్టు లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ ఈదల ఈశ్వరకుమార్(సామర్లకోట), క్లబ్ సభ్యుడు తలారి దొరబాబు ‘సాక్షి’కి తెలిపారు. అత్యుత్తమ ర్యాంకు సాధించి ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థినికి రాబోయే నాలుగు సంవత్సరాలు కూడా మెరిట్ సాధిస్తే చదువు పూర్తి అయ్యే వరకు స్కాలర్ షిఫ్ ఇవ్వడానికి లయన్స్ క్లబ్ ప్రతినిధులు అంగీకరించారని దొరబాబు చెప్పారు. ట్రస్టు చైర్మన్ బీవీఎస్ రెడ్డి, ట్రస్టు గౌరవ అధ్యక్షుడు డాక్టరు బాదం బాలకృష్ణ, వైస్ చైర్మన్ తలారి రామచంద్రరావు, కార్యదర్శి పెదిరెడ్డి ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

పెద్దాపురం డీఎస్పీగా శ్రీహరిరాజు నియామకం

పెద్దాపురం: స్థానిక డీఎస్పీగా డి.శ్రీహరిరాజును నియమిస్తూ ఆదివారం ప్రభుత్వ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా డీఎస్పీల బదిలీల్లో భాగంగా ఇప్పటి వరకు పెద్దాపురం డీఎస్పీగా పని చేస్తున్న లతాకుమారిని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు అందాయి. ఏసీబీ డీఎస్పీగా పని చేస్తున్న శ్రీహరిరాజును ఇక్కడ డీఎస్పీగా నియమించారు. ఈ మేరకు పెద్దాపురం డీఎస్పీగా ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు.

జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడిగా శ్రీకాంత్

సామర్లకోట: కాకినాడ జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడిగా బడుగు శ్రీకాంత్ ఎన్నికయ్యారు. ఆదివారం స్థానిక సుగర్ ఫ్యాక్టరీ గెస్టు హౌస్‌లో నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. ఎన్నికలో రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడి జి.వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం.సుబ్బరాజు, కోశాధికారి ఎన్.అర్జునరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ బి.సత్యనారాయణ ఆధ్వర్యంలో నూతన కమిటీ ఎన్నిక జరిగింది. అసోసియేషన్‌లో సామర్లకోటకు చెందిన వారికే ప్రాధాన్యత దక్కింది. వైస్ ప్రెసిడెంట్‌గా కొండపల్లి శ్రీను, కార్యదర్శిగా నిమ్మకాయల కిరణ్ ఎన్నికయ్యారు. నూతన కమిటీని మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ యార్లగడ్డ చిన్ని, వైఎస్సార్ సీపీ నాయకుడు గంగిరెడ్డి కృష్ణమూర్తి, కౌన్సిలర్ బలుసు వాసు, రైతు సంఘం అధ్యక్షుడు కంటే బాబు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ అడబాల కుమారస్వామి తదితరులు అభినందించారు.

స్ఫూర్తి ప్రదాత విశ్వేశ్వరయ్య

ఘనంగా ఇంజినీర్స్ డే



ఏలేశ్వరంలో రోదసి ప్రాజెక్టుపై అవగాహన కల్పిస్తున్న స్పార్క్ చైర్మన్ సాయిసందీప్



విశ్వేశ్వరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రగతి సిబ్బంది

గండేపల్లి: మోక్షగుండం విశ్వేశ్వరయ్య కృషి నేటి ఇంజినీర్లకు స్ఫూర్తినిస్తుందని ప్రగతి ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ పరుచూరి కృష్ణారావు అన్నారు. విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని ఆదివారం సూరంపాలెం ప్రగతి ఇంజినీరింగ్ కళాశాలలో ఇంజనీర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో నీటిపారుదల, వరదల నియంత్రణకు ఆయన చేసిన కృషి, అంకితభావం దేశవ్యాప్తంగా ఇంజినీర్లకు ఆదర్శమన్నారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. డైరెక్టర్ ఎంవీ హరనాథబాబు, వైస్ ప్రెసిడెంట్ ఎం.సతీష్ పాల్గొన్నారు.

ఏలేశ్వరం: దేశంలో ప్రముఖ ఇంజినీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని యర్రవరంలో ఆదివారం ఇంజినీరింగ్ డే నిర్వహించారు. స్పార్క్ సంస్థ చైర్మన్ సాయిసందీప్ ఆధ్వర్యంలో విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఇంజినీరింగ్ విద్యకు పునాది వేసిన మోక్షగుండం విశ్వేశ్వరయ్యను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. దేశానికి విశ్వేశ్వరయ్య అందించిన సేవలు అపూర్వమని కొనియాడారు. అనంతరం ప్రాజెక్టు రోదసి మిషన్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో రవికిరణ్, అదిత్య, సాహుల్, నవనీత్ తదితరులు పాల్గొన్నారు.

కళాకారులకు సత్కారం

సామర్లకోట: అంతరించుకుపోతున్న కళలను ప్రోత్సహిస్తున్నట్టు భారత మాత సేవా పరిషత్ అధ్యక్షుడు గొరకపూడి చిన్నయ్యదొర అన్నారు. స్థానిక సంపెంగతోటలో ఆదివారం సాయంత్రం కళాకారులకు పాటల పోటీలు ఏర్పాటు చేసిన వారిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు మూతిన రాంబాబు, ముప్పిడి బాబీ, మన్యం సూర్యారావు, మున్నీ, సత్యనారాయణ పాల్గొన్నారు.

బై బై గణేశా..

- వైభవంగా వినాయక నిమజ్జనాలు
- ఊరేగింపులో సందడి చేసిన యువత
- పలు గ్రామాల్లో అన్నసమారాధనలు



ఎస్.పైడిపాలలో నిమజ్జనానికి తరలి వెళుతున్న గణపతి విగ్రహం

ఏలేశ్వరం: గణపతి నవరాత్రుల ముగింపులో భాగంగా ఆదివారం గణేశ్ నిమజ్జనాలు వైభవంగా జరిగాయి. పట్టణంలోని ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో నెలకొల్పిన వినాయక విగ్రహాలను మేళతాళాలు, బాణసంచా కాల్పుల నడుమ ఊరేగించి స్థానిక ఏలేరు నదిలో నిమజ్జనం చేశారు. స్థానిక క్వారీ ప్రాంతం, లింగంపర్తి తదితర గ్రామాల్లో గణేశ్ నిమజ్జనాలు జరిగాయి. స్థానిక మెయిన్ రోడ్, బాలాజీ చౌక్, మార్కెట్ రోడ్, పల్లపువీధి మీదుగా స్వామివారిని ఊరేగించారు. నిమజ్జనాల్లో మహిళలు, యువకులు పాల్గొన్నారు.

రౌతులపూడిలో..

రౌతులపూడి: మండల పరిధిలోని గ్రామాల్లో ఆదివారం వినాయక నిమజ్జనాలు ఘనంగా జరిగాయి. మండలంలోని ఎస్.పైడిపాల, రౌతులపూడి సత్యదేవా కాలనీలో నెలకొల్పిన గణపతి విగ్రహాలను నిమజ్జనం చేశారు. మేళతాళాలు, తీన్‌మార్, కోలాటం వంటి సాంస్కృతిక కార్యక్రమాలు, బాణసంచా కాల్పుల నడుమ స్వామివారిని అత్యంత వైభవంగా ఊరేగించారు. మండలంలోని ఎస్.అగ్రహారం, ఎ.మల్లవరం, రౌతులపూడి సత్యదేవా కాలనీలో గణేశ్ మండపాల వద్ద అన్నసమారాధనలు నిర్వహించారు. వేలాది మంది భక్తులు పాల్గొని స్వామివారి అన్నప్రసాదాలు స్వీకరించారు.

గండేపల్లి/జగ్గంపేట: మండలవ్యాప్తంగా ఆదివారం గణేశ్ నిమజ్జనాలు ఘనంగా జరిగాయి. గణపతి నవరాత్రులు ముగియడంతో నీలాద్రిరావుపేట, తాళ్లూరు, మల్లేపల్లి, గండేపల్లి, మురారి తదితర గ్రామాల్లో బ్యాండ్ మేళాలు, తీన్‌మార్ డ్యాన్సులు, బాణసంచా కాల్పుల నడుమ స్వామివారిని ఊరేగించి నిమజ్జనం చేశారు. జగ్గంపేట బాలాజీ నగర్ పార్కు ఆవరణ, సౌభాగ్య అపార్ట్‌మెంట్ వద్ద ఆదివారం అన్నసమారాధనలు నిర్వహించారు. స్వామి వారికి నివేదించిన ప్రసాదం లడ్డూలకు పాటలు నిర్వహించగా సౌభాగ్య అపార్ట్‌మెంట్ లడ్డూ రూ.3300, పార్క్ వద్ద లడ్డూ రూ.15500లకు భక్తులు పాడుకుని లడ్డూ ప్రసాదాన్ని దక్కించుకున్నారు.

శంఖవరం: మండలంలోని జి.కొత్తపలి, అచ్చంపేట, శంఖవరం తదితర గ్రామాల్లో ఆదివారం గణేశ్ నిమజ్జనాలను ఘనంగా నిర్వహించారు. 9 రోజుల పాటు పూజలు అందుకున్న గణపతి విగ్రహాలను డప్పులు, తీన్‌మార్, బాణాసంచా కాల్పుల నడుమ ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం చెరువుల్లో, కాలువల్లో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఊరేగింపులో యువకులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి.

గోకవరం మండలంలో...

గోకవరం: గణపతి నవరాత్ర ఉత్సవాలను పురస్కరించుకుని గోకవరం మండలంలో ఆదివారం గణేశ్ నిమజ్జనాలు ఘనంగా జరిగాయి. మండల కేంద్రమైన గోకవరంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణపతి విగ్రహాలను కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో తీన్‌మార్ డప్పులు, బాజాలు, డీజే సౌండ్ల నడుమ ఊరేగించారు. అనంతరం గ్రామ శివారున ఉన్న చెరువుల్లో విగ్రహాలను నిమజ్జనం చేశారు. గణేశ్ నిమజ్జనాల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై పవన్ కుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.



జగ్గంపేట బాలాజీ నగర్‌లో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

ప్రత్తిపాడు రూరల్: మండల వ్యాప్తంగా ఆదివారం గణపతి నిమజ్జనాలు వైభవంగా జరిగాయి. మండలంలోని ప్రత్తిపాడు, ధర్మవరం, రాచపల్లి, ఒమ్మంగి తదితర గ్రామాల్లో తొమ్మిది రోజుల పాటు పూజలందుకున్న గణపతిని మేళతాళాలు, బాణసంచా కాల్పుల నడుమ ఊరేగించి సమీపంలోని పోలవరం, ఏలేరు కాలువలు, చెరువుల్లో నిమజ్జనం చేశారు.

అన్నసమారాధనలు

కిర్లంపూడి: వినాయక చవితి మహోత్సవాల్లో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం అన్నసమారాధలు నిర్వహించారు. కిర్లంపూడి సంతమార్కెట్లో వేంచేసిన లక్ష్మీగణపతికి ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. జగపతినగరంలోని పాతపైడితల్లి, శ్రీరామ్‌నగర్, కొత్తపేట మసీదు వీధుల్లోని వినాయక మండపాల వద్ద భారీ అన్నసమారాధనలు నిర్వహించారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

ప్రత్తిపాడు, ధర్మవరం తదితర గ్రామాల్లో అన్నసమారాధనలు నిర్వహించారు.

తొండంగి: గణపతి నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మండలంలో గణేశ్ నిమజ్జనాలు ఘనంగా జరిగాయి. తొండంగి, రావికంపాడు, ఏవీ నగరం, వేమవరం తదితర తీరప్రాంత గ్రామాలకు చెందిన గణపతి విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్లి అద్దరిపేట, పంపాదిపేట, దానవాయిపేట, యర్రయ్యపేట, తాటియాకులపాలెం, పెరుమాళ్లపురం సముద్ర తీరాల్లో నిమజ్జనం చేశబూరు. పలు గ్రామాల్లో భారీ అన్నసమారాధనలు నిర్వహించారు. బెండపూడి, గోపాలపట్నం, ఎ.కొత్తపల్లి, సీతారాంపురం తదితర గ్రామాల ప్రజలు గణపతి విగ్రహాలను అన్నవరం పంపా రిజర్వాయర్‌లో నిమజ్జనం చేశారు.



ఏలేశ్వరం గణేశ్ ఊరేగింపులో పాల్గొన్న పిల్లలు, మహిళలు



ప్రత్తిపాడులో గణపతిని నిమజ్జనానికి తరలిస్తున్న భక్తులు



గోకవరంలో గణేశ్ ఊరేగింపులో యువకుల సందడి



జి.కొత్తపల్లిలో గణపతిని ఊరేగిస్తున్న యువత